క్లుప్తంగా

లీగల్ సెల్ సెక్రటరీకి సన్మానం



దామోదర్‌ను సన్మానిస్తున్న నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ స్టేట్ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీగా జిల్లాకు చెందిన అడ్వకేట్ పిట్ట దామోదర్ యాదవ్ నియమితులయ్యారు. దీంతో ఆయన్ని శ్రీకాకుళంలోని తన స్వగృహంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం, భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, జనరల్ సెక్రటరీలు ఆదివారం దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాయితి వెంకట రమణ, పానిల ప్రసాద్, ఎడ్ల వెంకట, చిన్నా యాదవ్ ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భూసర్వే అధికారి



సుబ్బారావుకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని భూసమగ్ర రీసర్వే (అర్బన్) స్పెషల్ ఆఫీసర్, ఐఏఎస్ అధికారి బి.సుబ్బారావు ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆయనకు స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి తీర్థ ప్రసాదాలను ఇచ్చారు. ఆలయ విశిష్టతను వివరించి, పర్వదినాల విశేషాలను తెలియజేశారు. ఆదిత్యుడి జ్ఞాపికను ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు. అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి ఉన్నారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం



కవిసమ్మేళనలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్‌: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) 90వ నెలవారీ సాహితీ సమ్మేళనం ఆదివారం జరిగింది. సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో కవులు సామాజిక పరమైన కవితలు చదివి వినిపించారు. సమ్మేళనంలో కవులు బి.కోమలరావు, గుడిమెట్ల గోపాలకృష్ణ, పి.వి.దుర్గాప్రసాద్, నిక్కు అప్పన్న, బి.జగన్నాథరావు, ఐఎన్‌డీ ప్రసాదరావు, ఇద్దీ పాపయ్య ఉన్నారు.

పాదాలమ్మ ఆలయానికి రూ. లక్ష విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక బొందిలీపురం మున్సిపల్ స్కూల్ వద్ద నిర్మించనున్న కాళీమాత (పాదాలమ్మ) దేవాలయ అభివృద్ధికి దాతలు రూ. 1,01,116 విరాళాన్ని సమకూర్చారు. కొన్న చిన్నమ్మడు, చిన్నారావు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సత్యన్నారాయణ, వెంకటేశ్వరరావు (వాసు), మధుసూదనరావులు విరాళం మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు అన్నెపు నానాజీ, ఎండ రమేష్, మన్మథలకు ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో ప్రగడ అశోక్ కుమార్, పూడి బాలాదిత్య, వాండ్రంగి శ్రీనివాసరావు ఉన్నారు.

నీరజకు 'అభినయ ముగ్ధశ్రీ' పురస్కారం



అవార్డులతో నీరజ బృందం

శ్రీకాకుళం కల్చరల్‌: పట్టణానికి చెందిన అభినయ నృత్యనికేతన్ నృత్య దర్శకురాలు డాక్టర్ నీరజ సుబ్రహ్మణ్యంకు 'అభినయ ముగ్ధశ్రీ' పురస్కారంతో ఆదివారం సత్కరించారు. రాజమహేంద్రవరంలోని శ్రీపార్వతీ పరమేశ్వర హాల్లో ఈనెల రెండు, మూడు తేదీల్లో భారతీయ నృత్యోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నీరజ బృందంచే కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. అనంతరం ముఖ్యఅతిథులు, సంస్థ అధ్యక్షులు డాక్టర్ అరవ అనిల్‌కుమార్ చేతుల మీదుగా శిష్యులకు నటరాజ నంది అవార్డులు అందచేశారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



రణస్థలం: పాతర్లపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న పిన్నింటి సాయికుమార్



ఎచ్చెర్ల క్యాంపస్‌: అరిణాంఅక్కివలసలో వలస వచ్చిన చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన అధికారులు



ఎచ్చెర్ల క్యాంపస్‌: ఎచ్చెర్లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారులు



రణస్థలం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. పాతర్లపల్లి పీహెచ్‌సీలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఎచ్చెర్ల క్యాంపస్‌: ఎచ్చెర్ల మండలంలో 28 గ్రామ సచివాలయాల పరిధిలో ఎచ్చెర్ల, పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వైద్యులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 41 కేంద్రాలు ఏర్పాటు చేసి ఐదేళ్లలోపు చిన్నారులు 6,700 మంది చుక్కలు వేశారు. వైద్యాధికారులు ప్రియదర్శిని, ఎం.ఉషశ్రీతో కూడిన బృందం సభ్యులు పర్యవేక్షించారు.

జి.సిగడాం: అంగవైకల్యం లేని అందమైన బాల్యం చిన్నారుల హక్కు అని సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు అన్నారు. స్థానిక సచివాలయంలో 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు.

పల్స్‌పోలియో విజయవంతం

గార: చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు కార్యక్రమం మండలంలో విజయవంతమయ్యింది. ఆదివారం ఉదయం నుంచి మండలంలోని కళింగపట్నం, శ్రీకూర్మం, గార పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది పిల్లలకు చుక్కల మందు వేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఈశ్వరిదేవి శ్రీకూర్మం పీహెచ్‌సీ పరిధిలో కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. శ్రీకూర్మం దేవస్థానంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు చిన్నారులకు చుక్కల మందువేశారు. వత్సవలస రాజమ్మ తల్లి జాతర, గార బస్‌స్టాండ్ వద్ద ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలకు డ్రాప్స్ వేశార.

శ్రీకాకుళం రూరల్‌: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో డ్రాప్స్ వేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి నిర్మల బైరి గ్రామంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు.



జి.సిగడాం: సంతవురిటిలో పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు



గార: శ్రీకూర్మం దేవస్థానం వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం రూరల్‌: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న నాయకులు

నర్సింగ్ కళాశాల ప్రారంభం



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి

ఎచ్చెర్ల: నర్సింగ్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చేవూరి రామస్వామి తెలిపారు. లావేరు మండలం వెంకటాపురం గ్రామంలో కేడీఎం కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రారంభానికి ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ చిన్న పల్లెటూరుకు నర్సింగ్ కాలేజీ వచ్చేలా కృషిచేసిన కానూరి నారాయణరావును అభినందించారు. ఇక్కడ మరిన్ని ఉన్నత విద్యా సంస్థలు వచ్చేలా కృషిచేయాలని ఇందుకు స్థానికులు, సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సామాజికవర్గం జిల్లా అధ్యక్షుడు రాయల రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి కానూరి నారాయణరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కటకం నాగేశ్వరరావు, కోశాధికారి సారిపల్లి, గోవింద, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.వేణు, వైఎస్సార్‌సీపీ నాయకులు లుకలాపు అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, స్థానిక సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, మాజీ సర్పంచ్ శంబాన సూర్యనారాయణ, లెంక నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి



చిరుధాన్యాలతో ఆహారపదార్థాలపై తయారీని వివరిస్తున్న నిర్వాహకులు

రణస్థలం: మహిళలకు స్వయం ఉపాధితోపాటు ఆర్థికాభివృద్ధి సాధించే ప్రక్రియలో భాగంగా చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై మెలకువలు నేర్పుతున్నామని బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తెలిపారు. జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డు) ఏపీ సహకారంతో యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రణస్థలం మండలంలోని జే.ఆర్.పురం పరిధి వెంకటేశ్వర కాలనీలో 30 మంది మహిళలకు చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా 30 మంది మహిళలు యూత్ క్లబ్ తరపున విజయనగరం జిల్లా కొత్తవలసలోని ఆరోగ్య మిల్లెట్ మినీ పరిశ్రమను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిల్లెట్ ఎఫ్.పి.ఓ కె.సరస్వతి చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేయడం ఎలా, వ్యాపార అనుభవాలను వివరించారు. శిక్షణ పొందుతున్న మహిళలు, యూత్ క్లబ్ నిర్వాహకులు ఉన్నారు.

శ్రీవారి పుష్కరిణి పనులకు శంకుస్థాపన



పుష్కరిణి పనులకు శంకుస్థాపన చేస్తున్న యతిరాజులు

శ్రీకాకుళం కల్చరల్‌: పీఎన్‌కాలనీలోని నారాయణ తిరుమలలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శ్రీవారి పుష్కరిణి ఏర్పాటు పనులకు ఆదివారం శంకుస్థాపన జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త, విశ్రాంత జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి పుష్కరిణి నిర్మాణానికి సుమారు రూ.2 కోట్లు ఖర్చు అవుతోందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. పుష్కరిణిలో 12 విగ్రహాలు, శ్రీకృష్ణమూర్తి దివ్య విగ్రహం, కళాఖండాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. నారాయణ తిరుమల గొప్ప దివ్యదర్శనీయ ప్రదేశంగా తీర్చిదిద్దడమే తమ ఉద్దేశమన్నారు. గొప్ప ఆలయంగా ఇప్పటికే కీర్తి చెందిందని, నారాయణదాసు నిర్మించిన ఈ ఆలయం జిల్లాకే తలమానికంగా ఉందన్నారు. రానున్న భీష్మ ఏకాదశికి పుష్కరిణి నిర్మాణం పూర్తి కావచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్యామలరావు, ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, వేంకటరామానుజ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీత ఎంతో గొప్పది



హరనాథరావును సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్‌: ప్రపంచంలోని గ్రంథరాజాలలో శ్రీమద్భగవద్గీతకు ఎంతో ఉన్నత స్థానం ఉందని ప్రముఖ అష్టావధాని పైడి హరనాథరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో 'గీత-అష్టాంగయోగము'అనే అంశంపై ఆయన ఆదివారం ప్రసంగించారు. గీతలో 18 భిన్న యోగములు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. బ్రహ్మ సాక్షాత్కారం పొందడానికి అష్టాయోగాలు సహాయపడతాయన్నారు. మందిరం తరఫున పలువురు సభ్యులు వక్త హరనాథరావును సత్కరించారు. కార్యక్రమంలో మందిరం సభ్యులు బాపయ్య పంతులు, నిష్టల నర్సింహమూర్తి, ఎన్.నారాయణమూర్తి, ఐ.కుమార్, మంగిపూడి శ్రీనివాసరావు, బలగ తౌడు, బాబూరావు, పి.ఈశ్వరరావు, పి.అప్పలకొండ, కె.వాసుదేవరావు, పి.వి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: లావేరు మండలంలో తామాడ మోడల్ స్కూల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.డానియల్ ఆదివారం తెలిపారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150 ప్రవేశ పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ప్రవేశ పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం 96188 89650, 83286 34506 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా శ్రీసాయి విద్యామందిర్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



డ్యాన్స్‌తో ఆకట్టుకుంటున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నేటితరం విద్యార్థులకు సాధారణ విద్యతోపాటు విభిన్న రంగాల్లో ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా శ్రీ సాయి విద్యామందిర్ స్కూల్‌ను నడిపిస్తుండటం అభినందనీయమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మధుసూదనరావు (జెడ్పీహెచ్‌స్కూల్ బ్రాహ్మణతర్ల ఇంగ్లిషు ఉపాధ్యాయులు) అన్నారు. పీఎన్ కాలనీలోని శ్రీసాయి విద్యామందిర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డేతోపాటు 25 సంవత్సర సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలను స్థాపించి ఆదివారం నాటికి 24 ఏళ్లు పూర్తిచేసుకుని 25 ఏటలోకి అడుగుపెట్టడం సంతోషంగా ఉందని పాఠశాల డైరెక్టర్ బూరగాపు లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల సెక్రటరీ బి.లక్ష్మి, ప్రిన్సిపాల్ పైడి పాండురంగారావు, సీనియర్ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, తవిటిరాజు, మేనేజర్ పీఎస్ మహాలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, సెక్రటరీ పప్పల ఉపేంద్ర పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగికి సత్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: సమాచార శాఖలో డ్రైవర్‌గా సేవలందించి గత నెల 29న ఉద్యోగ విరమణ చేసిన తంపటాపల్లి రామరత్నం వీడ్కోలు సభ నగరంలోని ఆంధ్రప్రదేశ్ వాహన డ్రైవర్ల సంఘం హాలులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన్ని సత్కరించి సేవలను కొనియడారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నవీన్, సూర్యనారాయణ, పాపారావు, ఐ.శ్రీనివాసరావు, కె.రమణమూర్తి, ఐ.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్‌: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు నంబర్ కౌంటింగ్ పోటీలు జరిగాయి. 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎల్.నందికేశ్వరరావు, అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. క్లబ్ నిర్వాహకులు నటుకుల మోహన్, నిక్కు హరిసత్యనారాయణ, బి.ఎం.ఎస్.పట్నాయక్, ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన యువజన విభాగం సభ్యులు



మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

శ్రీకాకుళం రూరల్‌: రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావును రాగోలు పంచాయతీ రాయిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు యాళ్ల శ్రీను, సభ్యులు పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలతో మమేకమై ఉండాలని వారికి సూచించారు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



కన్నయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్, డిజిటల్ అసిస్టెంట్

జి.సిగడాం: మండల కేంద్రానికి చెందిన దువ్వు కన్నయ్య విజయనగరం జిల్లా రాజాం కేర్ ఆపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ రాంబాబు, డిజిటల్ అసిస్టెంట్ పాగిరి రాము ఆదివారం ఆస్పత్రికి వెళ్లి కన్నయ్యకు వృద్ధాప్య పింఛన్‌ను అందించారు .

అమ్మవారి యాత్ర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో నేతాలమ్మ తల్లి

జి.సిగడాం: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి నేతాలమ్మ 26 యాత్ర మహోత్సవాలు వాండ్రంగిలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 5వ తేదీవరకు యాత్ర నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీరోజు అమ్మవారికి అభిషేకాలతోపాటు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చున్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



ఎన్నికల సమరానికి తాము సిద్ధం అంటూ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, మహిళలు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం:

సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయిలో మేము సిద్ధం-మా మహిళలు సిద్ధం అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతోనే సీఎం జగన్ అందజేస్తున్నారన్నారు. ప్రతి పథకం లబ్ధిని అక్కచెల్లెమ్మల అకౌంట్లలోనే వేస్తున్నారన్నారు. దేశంలోనే మహిళల పేరుతో సంక్షేమ పథకాలు అందించేది ఒక్క జగనన్న ప్రభుత్వమేనని కొనియాడారు. నామినేటెడ్ పదవుల్లో కూడా మహిళలకు సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు. సీఎం జగన్ ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన ప్రతీ మహిళతో మాట్లాడి మరలా జగనన్న ప్రభుత్వం వచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ వైఎస్సార్‌సీపీ అక్కాచెల్లెమ్మలపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి వెంకటరత్నం, నాలుగు మండలాల మహిళా అధ్యక్షులు గురాన మానస, మహంతి విజయలక్ష్మి, గుండ భాగ్యశ్రీ, కంది రమాదేవి, మహిళా టీమ్ సభ్యురాలు వాన ప్రమీల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

భక్తితో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



భక్తిసంగీత విభావరి జరుగుతున్న దృశ్యం

గార: జొన్నలపాడు కాలనీలోని బృందావనంలో ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తితో జరుపుకున్నారు, ముందుగా ఆలయంలో చౌదరి దుర్గారావు దంపతులు పూజలు చేశారు. సాయంత్రం భక్తి సంగీవ విభావరి కార్యక్రమంలో భాగంగా సింహాద్రి శ్రీనివాసరావు, సతీష్‌కుమార్, వెంకటలక్ష్మి, పొట్నూరు యోగిత, కళింగపట్నం శ్రావణి, చౌదరి శ్రీనివాస్‌లు భక్తిగీతాలాలపరించారు. కార్యక్రమంలో రాజేష్, రాంబాబు, జగదీష్ కుమార్ పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ!

శ్రీకాకుళం క్రైమ్‌:

హేయ్ బ్రో అన్న పిలుపు ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన ఈ నెల ఒకటో తేదీ రాత్రి చోటు చేసుకోగా క్షతగాత్రులు రిమ్స్‌కు చేరడంలో ఔట్‌పోస్టు పోలీసులు ఫిర్యాదు నమోదు చేశారు. దాడిలో ఇరువర్గాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు తలకు గాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని కిమ్స్ ఆస్పత్రి సమీపంలో ఉన్న సంచార జాతుల వారైన పెదాల నాగరాజు, పెదాల మంజు (నాగరాజుకు బావ)లు కింతలి కనిమెట్టలో జరుగు అమ్మవారి సంబరాలకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా కింతలి గ్రామంలో దీపావళి సామాన్లు అమ్మే చోటకు వచ్చేసరికి వెనుకగా వస్తున్న ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు హేయ్ బ్రో అంటూ నాగరాజు, మంజులను పిలిచారు. దానికి ప్రతిగా వెంటనే నాగరాజు, మంజులు కూడా హేయ్ బ్రో అన్నారు. అక్కడికి కొద్ది దూరం క్రాస్ చేసి ముందుగా వెళ్లిపోయిన ముగ్గురు వ్యక్తులు నాగరాజు బండిని అడ్డగించి మమ్మల్ని ఏం తిట్టారంటూ ఇద్దరిపై భౌతికంగాను, కర్రలతో దాడికి దిగారు. ఈ దాడి నుంచి తప్పించుకున్న మంజు పక్కనే పొలంలోకి పారిపోగా నాగరాజు దొరికిపోయాడు. సమాచారం తెలుసుకున్న నాగరాజు కుటుంబీకులు అక్కడికి వెళ్లి దాడిని అడ్డుకున్నారు. కిమ్స్ సమీపంలో ఉన్న వారి టెంట్ల వద్దకు చేరుకోగానే ఆ ముగ్గురు వ్యక్తులు మరో ముగ్గురితో కలిసి దాడికి వచ్చారు. కర్రలతో దాడికి పాల్పడగా, నాగరాజు, అతని సోదరులు శ్రీను, దావీదులకు తలకు గాయాలయ్యాయి. దాడిని ప్రతిఘటించే పనిలో నాగరాజు కర్రతో ఎదురుదాడికి దిగాడు. ఈలోగా అక్కడే నైట్‌బీట్‌ల్లో విధుల్లోకి వచ్చిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. బాధితుడు నాగరాజు తెలిపిన ప్రకారం ముగ్గురు వ్యక్తులు మత్తులో ఉండటం, మరికొందరితో ఇంటికొచ్చి దాడికి పాల్పడటంతో భయపడి శనివారం రిమ్స్‌కు వెళ్లారు. ఇదిలా ఉండగా ఇదే ఘటనకు సంబంధించి శుక్రవారం రాత్రే పైడి వంశీ అనే వ్యక్తి రిమ్స్‌కు వెళ్లి తనపై కత్తులతోను, కర్రలతోను నాగరాజు వర్గీయులు దాడి చేశారని, అడ్డుపడిన తన స్నేహితులు అన్నెపు భరత్, పైడి రోహిత్‌లకు చిన్నగాయాలయ్యాయని అన్నారు. దాడికి గల కారణం కింతలి కనిమెట్ట దీపావళి సామాన్లు అమ్ముకున్న చోట తన బండిని ఇద్దరు వ్యక్తులు ఆపి డబ్బులు డిమాండ్ చేశారని, సెల్‌ఫోన్లు దోచుకునేందుకు ప్రయత్నించారన్నారు. తిరిగి వారి కుటుంబంలోని మహిళలు, సోదరులతో కర్రలతో దాడి చేశారన్నారు. దీనిపైనా ఔట్‌పోస్టులో ఫిర్యాదు నమోదైంది.